ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు

విశాలాంధ్ర - తెర్లాం: అడ్డురోడ్డు జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లకు పోలీసులు అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లంతా సంబంధిత పత్రాలు లైసెన్సు, సి.బుక్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ఓవర్ లోడ్ ఎక్కించరాదని, మైనర్లు బైకులు నడపవద్దని సూచించారు. ద్విచక్ర వాహనదారులకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సాగర బాబు, ఏఎస్ఐ జి.భాస్కరరావు, సంబంధిత పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వారంలోగా సర్వే వినతులన్ని పరిష్కారం కావాలి: కలెక్టర్

విశాలాంధ్ర - విజయనగరం: రెవెన్యూ, రీ సర్వే వినతులన్ని వారంలోగా పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. అర్జీలను డిస్పోజ్ చేయడం ముఖ్యం కాదని, పరిష్కారం కావాలని స్పష్టం చేసారు. ప్రతి సోమవారం కలక్టరేట్‌కు వచ్చే వినతుల్లో 90 శాతం వరకు రెవెన్యూకు సంబంధించి నవేనని, రెవెన్యూ అధికారులే ఇందుకు కారణమని అన్నారు. గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో విజయనగరం, నెల్లిమర్ల నియోజక వర్గాల రెవెన్యూ అధికారులతో కలెక్టర్ అంబేద్కర్, జేసి సేతు మాధవన్ ఇళ్ళ స్థలాల క్రమ బద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ళ స్థలాల రీ వెరిఫికేషన్, వాటర్ టాక్స్, ఆన్లైన్ సర్వీసెస్ పెండింగ్, రీ సర్వే, పిజిఆర్ఎస్ వినతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆక్రమితదారులతో దరఖాస్తులు పెట్టించాలని, అందుకోసం వి.ఆర్.ఓలు క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ సందర్శిం చాలని తెలిపారు. రెండు రోజుల గడువులో అన్ని గ్రామాలలో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయాలని సూచించారు. వచ్చే సోమవారం నుండి ఈ విషయంపై వినతులు అందితే సంబంధిత వి.ఆర్.ఓపై చర్యలు తీసుకుంటామన్నారు. అందరికీ గృహాలు పథకం క్రింద జిల్లాలో 6 వేల దరఖాస్తులు అందాయని, వీటిని వెరిఫై చేసి శనివారం నాటికి ఆన్లైన్ చేయాలని తెలిపారు. రీ సర్వేలో జరిగిన తప్పిదాలను సవరించాలని, వెబ్‌ల్యాండ్‌లో ఒకరి పేరుంటే పొజిషన్‌లో ఇంకొకరి పేరు ఉందని, డాక్యుమెంట్‌లను వెరిఫై చేయకుండా తప్పులు తప్పులుగా నమోదు చేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాటర్ టాక్స్ జిల్లాలో సుమారుగా 10 కోట్ల రూపాయల వరకు వసూలు చేయవలసి ఉండగా కేవలం 53 వేల రూపాయలను మాత్రమే వసూలు చేసారని, ఇకపై వారం వారం లక్ష్యాలను నిర్దేశించాలని జేసీకి సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ డి.ఆర్.ఓ మురళీ, ఇన్‌చార్జ్ ఆర్.డి.ఓ వెంకటేశ్వరరావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి రమణ మూర్తి, రెండు నియోజకవర్గాలకు చెందిన తహశీల్దార్లు, సర్వేయర్లు, వి.ఆర్.ఓ లు, డి.టిలు పాల్గొన్నారు.

బాలింతలకు కూటమి సర్కార్ కానుక

మళ్లీ అందుబాటులోకి రానున్న ఎన్‌టీఆర్ బేబీ కిట్లు
బాలింతలకు 11రకాల వస్తువులు అందజేయనున్న ప్రభుత్వం

విశాలాంధ్ర - విజయనగరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం బాలింతలకు తీపి కబురును అందించింది. గత ప్రభుత్వ హయాంలో ఆగిపోయిన ఎన్‌టీఆర్ బేబీకిట్లును తిరిగి పున:ప్రారంభించాలని నిర్ణయించుకుంది. ఈమేరకు సోమవారం జీవో నెం.61ను విడుదల చేయడం జరిగింది. ఎన్‌టీఆర్ బేబీ కిట్‌లో మొత్తం 11 రకాల వస్తువులను బాలింతలకు ప్రభుత్వం అందజేయనుంది. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవించే బాలింతలకు ఈ బేబీ కిట్‌లను అందజేస్తారు.

కిట్‌లో ఉండే వస్తువులు ఇవే..
ఎన్‌టీఆర్ బేబీకిట్‌లో మొత్తం 11 వస్తువులు ఉంటాయి. వాటిలో బేబీ బెడ్, దోమతెర, టవల్, సోప్, బేబీ ఆయిల్, హ్యాండ్‌బేగ్, న్యాప్‌కిన్, పౌడర్, షాంపూ, బేబీ సోప్, సోప్‌బాక్స్, చిన్న బొమ్మలు ఉంటాయి.

జిల్లాలో ఏడాదికి దాదాపు 9వేలకు పైగా ప్రసవాలు:
విజయనగరం జిల్లాలో ఒక జిల్లా ఆసుపత్రి (ఘోషాసుపత్రి), 4 ఏరియా ఆసుపత్రులు, 4 సిహెచ్‌సీలు, 68 పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటి పరిధిలో ఏడాదికి దాదాపు 9వేలకు పైగా సరాసరిగా ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఒక్క ఎన్‌టీఆర్ బేబీకిట్ విలువ రూ.1410లుగా కాగా మన విజయనగరం జిల్లాకు రూ.1.30కోట్లు వరకు ఖర్చు చేయాల్సి వుంది. 2016లో నాటి టీడీపీ ప్రభుత్వం ఎన్‌టిఆర్ బేబీ కిట్లును అమలు చేసింది. అనంతరం వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటి స్థానంలో వైఎస్ఆర్ బేబీకిట్లను దాదాపు 6 నెలలపాటు అందజేసి అనంతరం ఆపేవేసింది. దీంతో బాలింతలు పుట్టిన బిడ్డకు సంబంధించిన అన్ని వస్తువులను కొనుగోలు చేసుకోవాల్సి వచ్చింది. తాజాగా కూటమి ప్రభుత్వం మళ్లీ ఎన్‌టిఆర్ బేబీ కిట్లును అందజేయడంతో బాలింతలలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఎంతో శుభపరిణామం

బాలింతలకు ఎంతో అవసరమైన బేబీకిట్లును ప్రభుత్వం అందజేయాలని నిర్ణయించడం శుభపరిణామం. ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయి. మార్కెట్‌లో చాలా ఖరీదైన ఈ వస్తువులు బాలింతలకు ఎంతగానో ఉపయోగ పడతాయి. ఈ కిట్లు వలన పేద వర్గాలకు ఎంతగానో ఆర్థిక భారం తగ్గుతుంది.
- డా.ఎస్.జీవనరాణి, డిఎంహెచ్‌వో.

కిల్తంపలెం రెవెన్యూలో చెరువు గర్భాలు ఆక్రమణ

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం కిల్తంపాలెం రెవెన్యూ గ్రామ పరిధిలో చెరువు గర్భాల ఆక్రమణలు భారీగా జరుగుతున్నాయి. కిర్తింపాలెం రెవెన్యూ పరిధిలోని పిల్లివాని చెరువు (4.88 ఎకరాలు), శివన్న చెరువు (0.90 ఎకరాలు), మొగలాయి చెరువు (2 ఎకరాలు) వంటి జలాశయాలు ఆక్రమణలకు గురవుతున్నాయి. ఫిర్యాదులను పరిష్కరించాల్సిన రెవెన్యూ అధికారులు, "రోవర్ పనిచేయటం లేదు" అనే సాకుతో కాలయాపన చేస్తున్నారు. ఇరిగేషన్ శాఖ సహాయంతో సర్వే చేసి, ట్రెంచ్ కట్ ఏర్పాటు చేయాలని, ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేస్తూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి హెచ్చరించింది. గత 10 సంవత్సరాల్లో మండలంలో 60% చెరువులు అదృశ్యమయ్యాయని, అధికారులు వెంటనే చర్య తీసుకోకపోతే పోరాటం చేస్తామని సమితి అధ్యక్షులు ముత్యాల నాయుడు హెచ్చరించారు.

ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటాలి

సబ్ ట్రెజరీ అధికారి పివి పద్మనాభం

విశాలాంధ్ర - బొబ్బిలి: అంతర్జాతీయ జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా స్థానిక సబ్ ట్రెజరీ అధికారి పివి పద్మనాభం ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరు ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేసి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, ఎంపీడీవో రవికుమార్‌లు పాల్గొని కార్యాలయం ఆవరణలో చింత, కాగు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సబ్ ట్రెజరీ కార్యా లయం సిబ్బంది సీనియర్ సహాయకులు జి.రామ లక్ష్మి, టి.విజయ, జి.సూజాత, మండల అభివృద్ధి కార్యాలయం సిబ్బంది అప్పారావు, సుదా తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర - చీపురుపల్లి/మెరకముడిదాం: నిత్యావసర వస్తువుల ప్రజా పంపిణీ కార్యక్రమంలో భాగంగా గత వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యాన్ల విధానమును రద్దు పరిచినందుకుగాను చీపురుపల్లి నియోజకవర్గంలో గల నాలుగు మండలాల రేషన్ డీలర్లు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం చీపురుపల్లిలో గల ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నియోజకవర్గంలో గల గుర్ల మెరకముడుదాం గరివిడి చీపురుపల్లి మండలాలకు చెందిన డీలర్లు చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తూ హర్ష ద్వానాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి రేషన్ డీలర్ అధ్యక్షుడు రుంకానా రామారావు, గరివిడి మండల అధ్యక్షులు కుములి జనార్దన్, మెరకముడుదాం అధ్యక్షులు జై సింహా నాయుడు, గౌరవ అధ్యక్షులు రాజగోపాల్ నాయుడు, గౌరవాధ్యక్షులు కింగువా శ్రీనివాసరావు, గంటేడ సత్యనారాయణ, కెల్లా గోవింద నాయుడు, పొట్నూర్ కామేశ్వరరావు, వారణాసి శ్రీనివాసరావు, సూరి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలి

విశాలాంధ్ర - నెల్లిమర్ల: అర్హులైన వితంతువులకు, వృద్ధులకు పెన్షన్లు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి మొయిద పాపారావు అన్నారు. గురువారం నెల్లిమర్ల ఎంపీడీవోకు మొయిద పాపారావు, సీపీఎం మండల కార్యదర్శి కిలంపల్లి రామారావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చి సంవత్సరం అవుతున్నా అర్హులకు పెన్షన్లు మంజూరు చేయడంలో విఫలం అవుతున్నాయని అన్నారు. వితంతువు లేదా వృద్ధులకు పెన్షన్లు మంజూరు చేయకపోతే భవిష్యత్తులో వామపక్ష పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

చెరువు కాలువను కప్పేసిన చరణ్ గ్రూప్

ఉప తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన రైతులు

విశాలాంధ్ర - పూసపాటిరేగ: మండలంలోని చోడమ్మ అగ్రహారం పంచాయతీ పరిధిలో చరణ్ గ్రూప్ లేఅవుట్ కోసం చెరువు కాలువను కప్పేసారంటూ రైతులు గురువారం ఉప తహశీల్దార్ రమేష్‌కి ఫిర్యాదు చేశారు. మా రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 60.1 ఏ, 60.2 ఏ, 60.3 ఏ, 60.4ఎలో గల భూముల్లో చరణ్ గ్రూప్ వారు లేఅవుట్ వేస్తున్నారన్నారు. అయితే ఆ లేఅవుట్‌పై మా గ్రామానికి చెందిన లక్ష్మణుడు చెరువు ఉందని, ఆ చెరువు నుండి బయటికి పోయే సాగునీరు కాలువను కప్పేసి లే అవుట్ వేస్తున్నారన్నారు. ఈ విషయమై రైతులంతా వెళ్లి లేఅవుట్ ప్రతినిధులను ప్రశ్నించగా కొంతకాలం తర్వాత తీసేస్తామని సమాధానం చెబుతున్నారన్నారు. ఈలోగా వర్షాలు పడితే కాలువ లేకపోవడంతో చెరువు నిండి గ్రామం ముంపునకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అయినా పంట కాలువలను కప్పి పైపులు వేయడం నేరమన్నారు. హైవే స్థలంలో కూడా పైపులు వేసి కాలువను కప్పేస్తున్నారని అన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఆయన స్పందించి లేఅవుట్‌లోకి సర్వేయర్‌ని, వీఆర్‌ఓను పంపించి పరిశీలిస్తామన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో మాజీ సర్పంచ్ పిల్ల అప్పలనాయుడు, జమ్మిరాజు, గుడివాడ అప్పల నరసయ్య, జి.రాము, గుడివాడ అప్పల రాముడు, సూర్యనారాయణ, జి.వెంకటరమణ, జి.రమణ, జి.సత్యం, జి.గురు నాయుడు తదితరులు ఉన్నారు.

వి.ఆర్.ఓ.లు పనితీరు మెరుగుపరచుకోవాలి

విశాలాంధ్ర - శృంగవరపుకోట: రెవెన్యూ శాఖలో వి.ఆర్.ఓ.ల పనితీరు ఆధారంగానే బదిలీలు చేయబడతాయని, ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ స్పష్టం చేశారు. శృంగవరపుకోట నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, వి.ఆర్.ఓ.లతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో అతను ఇళ్ళస్థలాల క్రమబద్ధీకరణను 3 రోజుల్లోపు పూర్తిచేయాలని, నీటితీరువా బకాయిలు (రూ.2.70 కోట్లు) వసూలు చేయాలని ఆదేశించారు. భూముల రీసర్వేలోని తప్పులు వారంలో సరిచేయాలని, ప్రజా వినతులకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. ఆన్లైన్లో 4063 ఇళ్ళస్థల దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఇన్‌ఛార్జి డి.ఆర్.ఓ. మురళి, ఇన్‌చార్జి ఆర్.డి.ఓ. వెంకటేశ్వరరావు, సర్వే విభాగం ఏ.డి. రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - శృంగవరపుకోట రూరల్: శృంగవరపుకోట మండలం కేంద్రంలో బ్రాహ్మణ వీధిలో కోదండ రామలయం సంస్థ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమంత స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి, 700 మందికి అన్నదానం చేయడం జరిగింది.

నవధాన్యాల సాగుపై అవగాహన

విశాలాంధ్ర - రాజాం: మండలంలో గా్రాజు చీపురుపల్లి యూనిట్‌లో బొమ్మినాయుడు వలస గ్రామంలో నవధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. 25 రకాలు విత్తనాలతో 12 కేజీలు ఒక కిట్టు తయారు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అధికారలు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఒక ఎకరానికి 18 నుండి 30 రకాల విత్తనాలతో 10 నుండి 12 కేజీలు నవధాన్యాలు వేసుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు నవధాన్యాలు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ యూనిట్ ఇన్‌చార్జ్ బి.రమాదేవి, ఐసిఆర్పి శ్రావణి, రైతులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు

హనుమాన్ జయంతి ర్యాలీలో కరాటే కళ్యాణి

విశాలాంధ్ర - విజయనగరం ఫోర్ట్: పట్టణంలో గురువారం హనుమాన్ జయంతి సందర్భంగా హిందూ ధర్మ రక్షా సమితి జిల్లా శాఖ ఆధ్వర్యంలో హనుమాన్ శోభా యాత్ర వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భారీ హనుమాన్ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై నిలిపి పలు కూడళ్ల మీదుగా ఊరేగింపు

నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసానికి సరస్వతి స్వామి సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆబోతుల శ్యాం సుందర్, రాష్ట్ర అధ్యక్షుడు నంది వాడ వేణుగోపాల్, శ్రీ ఆదిభట్ల నారాయణదాసు, కళాపీఠం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు పెండ్యాల కళ్యాణి(సినీ నటి) సామాజిక సేవకులు సిరిసహస్ర, హనుమాన్ భక్తులు శ్రీ స్వామి వారి జెండాలతో పాల్గొని జైశ్రీరామ్, జై హనుమాన్ జయ నాదాలు చేసారు.

లెప్రా సొసైటీ సేవలు అభినందనీయం

విశాలాంధ్ర - మెంటాడ: లెప్రా సొసైటీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలో కుష్ఠ వ్యాధి బాధితులకు అనేక సేవలు చేస్తుందని లెప్రా సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమని ఎంపీడీవో భానుమూర్తి అన్నారు. గురువారం మండల కార్యాలయంలో లెప్రా సొసైటీ మండల ఆర్గనైజర్ లెంక రమణ ఆధ్వర్యంలో ఎంపీడీవో భానుమూర్తి చేతుల మీదుగా చల్లపేట, జక్కువ గ్రామాలలో గల కుష్ఠ వ్యాధి, ఫైలేరియా బాధితులకు పాదరక్షకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ స్వయం సంరక్షణతోనే అంగవైకల్యం నిర్మూలించవచ్చని, ప్రభుత్వంతో కలిసి లెప్రా సొసైటీ చేస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో లెప్రా సొసైటీ సిబ్బంది, బాధితులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి వ్యక్తి మృతి

విశాలాంధ్ర - గుర్ల: మండలంలో కెల్ల గ్రామంలో గురువారం పురుగులు మందు తాగి సువాడ గోవింద్ (32) మృతి చెందారు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన కూలి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ తరుణంలో పురుగులు మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ప్రభుత్వ మహారాజ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. సంఘటత స్థలానికి ఎస్సై పి.నారాయణ రావు చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటిని పొదుపుగా వాడుకోవాలి

నగరపాలక కమిషనర్ కిల్లాన

విశాలాంధ్ర - విజయనగరం: తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని ప్రజలకు విజయనగరం నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ కిల్లాన అప్పలరాజు సూచించారు. వార్డు పర్యటనలో భాగంగా గురువారం మయూరి జంక్షన్ నుండి ప్రారంభమై స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. నాగోజీపేట, తోటపాలెం తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ జీవీ రంగారావు తో కలిసి ఆయన పర్యటించారు. కొన్నిచోట్ల పైప్ లైన్ లీకేజీలను గుర్తించి, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నా రంటూ సచివాలయ కార్యదర్శులను మందలిస్తూ ఇకనుండి పైప్ లైన్ లీకేజీలు గుర్తిస్తే శ్రీముఖాలు జారీ చేస్తామని స్పష్టం చేశారు. అలాగే ఖాళీ స్థలాలలో చెత్తాచెదారాలు పడి ఉండడాన్ని గమనించి సిబ్బందిని మందలించారు. తక్షణమే స్థల యజమానులకు నోటీసులు జారీచేయాలని ఖాళీ స్థలాల పన్నులను వెంటనే చెల్లించేలా వారిపై ఒత్తిడి తేవాలని చెప్పారు. ఇప్పటికీ పన్నులు విధించని ఖాళీ స్థలాలు గానీ ఇళ్లను గాని వెంటనే గుర్తించి వాటికి పన్ను విధింపు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. వార్డు పర్యటన అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో వార్డు పర్యటన చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగా ఈరోజు 33వ డివిజన్ ప్రాంతంలో పర్యటించి సమస్యలను గుర్తించామన్నారు. అయితే కాలువలు,వీధి దీపాల నిర్వహణ సక్రమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేసే విధంగా సచి వాలయ కార్యదర్శులకు ఆదేశించామన్నారు. ఖాళీ స్థలాల యజమానులు తమ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకొని, పన్నులు సకాలంలో చెల్లించాలని స్పష్టం చేశారు. స్థానిక కార్పొరేటర్ జీవీ రంగారావు మాట్లాడుతూ తమ డివిజన్లో సహాయ కమిషనర్ పర్యటించి సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తారన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరిం చగలిగామని, తమ హయాంలో అభివృద్ధి జరగడం ఆనం దంగా ఉందన్నారు. కొద్దిపాటి సమస్యలను కూడా త్వర లోనే పరిష్కరించి ప్రజలకు మెరుగైన పాలన అందించే విధంగా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సత్యవతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీతంలో యోగా తరగతులు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం కళాశాలలో, జేఎన్టీయూ గురజాడ విజయనగరం సూచన మేరకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నెలరోజుల పాటు ప్రతిరోజు కళాశాలలో అధ్యాపకులు, ఇతర సిబ్బంది, విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించను న్నారు. మొదటిరోజు యోగా తరగతులు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వి రామమూర్తి ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. ఈ యోగా కార్యక్రమంలో అధ్యాపకులు, ఇతర సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్ " యోగా ఫర్ వన్ ఎర్త్, వన్ హెల్త్"ను గుర్తు చేసుకున్నారు.

పిసి అండ్ పిఎన్‌డిటి చట్టంపై అవగాహన

విశాలాంధ్ర- చీపురుపల్లి: పట్టణంలోని ఆర్‌డివో కార్యాలయంలో ఆర్‌డివో ఆశయ్య అధ్యక్షతన పిసి అండ్ పిఎన్‌డిటి చట్టం అమలుపై గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో చీపురుపల్లి డివిజనల్ స్థాయి పిసి అండ్ పిఎన్‌డిటి కమిటీలో ఉన్న అధికారులు తో సదరు చట్టం అమలుపై తీసుకుంటున్న చర్యలు ప్రస్తుతం తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు.ఇందులో ముఖ్యంగా ప్రస్తుత సంఘంలో నెలకొని ఉన్న పురుష సంతాన ప్రాధాన్యతపై మాట్లాడారు. ఆడపిల్లల పట్ల వివక్షత, మూఢనమ్మకాలు వంటి వివిధ సామాజిక కారణాల దృష్ట్యా కడుపులో పెరుగుతున్నది ఆడ శిశువు అని తెలిస్తే చాలు గర్భస్రావాలు చేయించుకోవడం విపరీతంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేసారు.. అందుకే ప్రభుత్వం 0-6 సంవత్సరాలు బాలికల లింగ నిష్పత్తిని పెంచడానికి పిసి అండ్‌పిఎన్‌డిటి 1994 (లింగ నిర్ధారిత పరీక్షల నిరోధ) చట్టం ను కఠినంగా అమలు చేయడం ద్వారా లింగ నిర్ధారిత ఆడ శిశువుల భ్రూణ హత్యలు నిరోధించుటకు ఈ చట్టం ప్రాధాన్యతను ఇస్తుందని తెలియజేశారు. అలాగే చీపురుపల్లి డివిజన్‌లో ఏస్కాన్ సెంటర్ వారైన లింగ నిర్ధారణ చర్యలకు పాల్పెడితే వారిపై ఈచట్టము ను అనుసరించి వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.ఎన్. సూర్యనారాయణ, పోలీస్ శాఖ నుండి ఎస్.ఐ లోకేశ్, చిన్న పిల్లల వైద్య నిపుణులు డా.రమేష్, స్త్రీ వైద్య నిపుణులు డా. అర్చన, హ్యూమన్ రైట్స్ ప్రతినిది వి.పద్మలత, ఐసిడిఎస్ నుండి సిడిపివోలు, ఆర్‌డివో ఆఫీసు నుండి ఎవో ఈశ్వరమ్మ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుండి డెమో చిన్నతల్లి, ఏం. చాముండేశ్వరి, హెల్త్ ఎడ్యుకేటర్, పవన్ ఆశిష్ మానిటరింగ్ కన్సల్టెంట్ డెమో సెక్షన్ నుండి పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

విశాలాంధ్ర - మెరకముడిదాం: మెరకముడిదాం తహశీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో బి.ఆశయ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే అయిన గ్రామాలపై ఆరా తీశారు. రీ సర్వే అయిన గ్రామాల్లో సర్వేలు వీఆర్వోలతోపాటు డీటీ, తహసిల్దార్ చిత్తశుద్ధితో అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. అలాగే జూన్ 1 నుంచి రేషన్ డిపోల ద్వారా డీలర్లే ప్రజా పంపిణీ చేయాలి కాబట్టి రేషన్ డిపోలను తనిఖీ చేసి ఏర్పాట్లు పూర్తి చేయాలని సిహెచ్డిటి నాగలక్ష్మికి తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ క్యాస్ట్ సర్టిఫికెట్‌పై పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అజూరఫీ జాన్, డిప్యూటీ తహశీల్దార్ భాస్కరరావు, ఆర్ఎస్డిటి, వీఆర్వోలు సర్వేయర్లు పాల్గొన్నారు.

మండలంలో ఎమ్మెల్యే లోకం మాధవి పర్యటన

విశాలాంధ్ర - డెంకాడ: కూటమి ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని రైతు సమస్యలపై నిత్యం గ్రామాల్లో రైతులతో కలసి సమస్యలను అడిగి తెలుసుకోవడంలో భాగంగా బుధవారం డెంకాడ మండలం డి-కొల్లాం నుండి డెంకాడకు వెళ్లే కాలువ పూడిక తీత, జంగిల్ క్లియరెన్స్ పనులను నెల్లిమర్ల నియోజకవర్గం శాసనసభ్యురాలు లోకం నాగ మాధవి పరిశీలించారు. రైతుల ద్వారా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖరరావు, పల్లె భాస్కరరావు, విజయనగరం పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కలిదిండి పాణిరాజు, మాజీ నీటి అనకట్ట చైర్మన్, డెంకాడ గ్రామ పార్టీ అధ్యక్షులు కలిదిండి రంగరాజు, తెలుగుదేశం జనసేన కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. 232/3023
Between:
Vujji Surya Malleswara Rao ... Plaintiff
And:
Bandaru Krishna ..... Defendant
To,
Defendant
Bandaru Krishna s/o late Venkata Rao, D.No. 63-72-27, Poolbag Colony, Vizianagaram Post and District.
నోటీసు
పై నెంబరు దావాలో ప్రతివాది తన అవసర నిమిత్తం వాది గారి వద్ద నగదు బదులు తీసుకొని ప్రాంసరీ నోటు రాసి ఇచ్చిరి. సదరు బాకీ చెల్లించమని వాది ప్రతివాదిని ఎన్ని పర్యాయములు డిమాండ్ చేసినప్పటికీ చెల్లించనందున వాది పై నెంబరు దావా దాఖలు చేసిరి. సదరు దావాలో ప్రతివాదికి అనేక పర్యాయములు Suit Summons కొరకు బేటా కట్టినప్పటికీ ప్రతివాదికి అమలు జరగనందున, ఇందు మూలముగా తెలియ జేయునది ఏమనగా ప్రతివాదికి Suit Summons కొరకు తే 27-6-2025దీకి వాయిదా కలదు. కావునా మీకు ఏమైనా అక్షేపణలున్నచో తే 27-6-2025దీ వాయిదా రోజున పై కోర్టులో ఉదయం 10.30 ని.లకు హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.
అనకాపల్లి
20-5-2025
గేదెల రామచంద్రరావు
అడ్వకేట్, అనకాపల్లి
సెల్:9985699922

సీఎం, డిప్యూటీ సీఎంల ఫొటోలకు పాలాభిషేకం

విశాలాంధ్ర - బొబ్బిలి: రేషన్ కార్డులు లబ్ధిదారులకు రేషన్ డీలర్లు ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేయడానికి ఆ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ద్వారా జూన్ నెల నుండి సరుకులు పంపిణీ చేయడానికి ఆదేశాల జారీ చేయడంతో గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవణ్ కళ్యాణ్‌ల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్లు సంక్షేమ సంఘం అధ్యక్షుడు గేదేల సత్యనారాయణ, తెంటు సూర్యనారాయణ, గొట్టాపు కోటేశ్వరరావు, ఏడుకొండలు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

26లోగా అసంపూర్తి నిర్మాణాలు పూర్తి చేయాలి

నగర పాలక కమిషనర్ పల్లి నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం: ఈనెల 26వ తేదీలోగా అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యేవిధంగా పర్యవేక్షించాలని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య సిబ్బందికి ఆదేశించారు. ఈ మేరకు గురువారం పట్టణ సమీపంలోని గుంకలాం, కొండకరకం ప్రాంతాలలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఎంత మేర ఇళ్ల నిర్మాణాలు జరిగాయి, స్లాబ్ వరకు వచ్చిన ఇల్లు ఎన్ని వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయించి ప్రభుత్వ లక్ష్యాన్ని అధిగమించాలని సిబ్బందికి ఆదేశించారు. త్వరలో జరగనున్న గృహప్రవేశాలకు సిద్ధం చేయించాలని చెప్పారు. అనంతరం కే ఎల్. పురం లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున పేదల ఇళ్ళ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ప్రణాళికలను రూపొందించిందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల నిర్మాణాలు పూర్తి కావాలని లక్ష్యంగా నిర్దేశించిం దన్నారు. ఇందుకోసం ప్రతి లబ్ధిదారులకు అదనంగా 50 వేల రూపాయలను ఇంటి నిర్మాణ పనులు పూర్తయ్యేందుకు ఆర్థిక సాయం అందించనున్నదని తెలిపారు. వివిధ దశల్లో ఉన్న ఇళ్లను పూర్తి చేయించేందుకు లక్ష్యాలను నిర్దేశించిందన్నారు. ఇకపై ఇళ్ళ నిర్మాణాల విషయంలో ప్రతిరోజు సమావేశాలు నిర్వహించి పనులు పూర్తయ్యేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు చెప్పారు. వివిధ దశలలో ఉన్న ఇళ్ళ నిర్మాణాలను పూర్తిచేసి గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించామన్నారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ పి.డి. జి. మురళీమోహన్, డిఈ జివి రంగారావు, ఏఈ కె. రామకృష్ణ పాల్గొన్నారు.

అన్నసమారాధనలో ఎమ్మెల్యే బేబీనాయన

విశాలాంధ్ర - బొబ్బిలి: శ్రీ హనుమాన్ జయంతి సందర్భంగా ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) అన్నసమారాధనలో పాల్గొన్నారు. పట్టణంలో తారకరామ కాలనీ, కృష్ణా టాకీస్ జంక్షన్ వద్ద ఉన్న హనుమాన్ మందిరాలు, బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామంలో ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో అన్నసమారాధన కార్యక్రమాలలో పాల్గొని, భక్తులకు స్వయంగా ప్రసాదం అందించారు.

ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేట గ్రామంలో శ్రీ మారుతీ యువజన సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ కార్యక్రమ జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే సాయంత్రం ఆలయంలో భజన కార్యక్రమాలు నిర్వహించారు.

మెంటాడ: మెంటాడ మండలంలోని జి.టి.పేట గ్రామంలో ఆలయ కమిటీ చైర్మన్ చొక్కకు సన్యాసినాయుడు (అమ్మ స్వచ్ఛంద సంస్థ చైర్మన్) ఆధ్వర్యంలో గురువారం ఉదయం అభయాంజనేయ స్వామి జయంతి వేడుకలు జరిగాయి. జి.టి.పేట గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో వైభవంగా వేడుకలు ఘనంగా జరిపారు. స్వామివారికి విశేష అభిషేక పూజలతో పాటు పంచకుండాత్మక హనుమాన్ కవచహవనం, పూజలు యజ్ఞలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న భక్తులందరూ పెద్ద సంఖ్యలో ఆలయం వద్దకు చేరుకొని పూజలు నిర్వహించారు. ఆలయం ప్రధాన అర్చకులు బి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పూజలు జరిపారు. అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు.

అనంతరం తీర్థప్రసాదాలు సేకరించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు చొక్కాకు సన్యాసినాయుడు చొక్కాకు కొండమ్మ తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలో ఆంజనేయస్వామి భక్తులు గ్రామ పెద్దలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రాజాం: హనుమాన్ జయంతి సందర్భంగా రాజాం అమ్మవారి కాలనీలో వేంచేసిన శ్రీ అభయ ఆంజనేయస్వామి వారికి మహాధ్యాసం శ్రీనివాసరావు దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు మావుదూరి వెంకటరమణ శర్మ భక్తులకు తీర్థ ప్రసాదములు అందించారు. అమ్మవారి కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, పరిసర ప్రాంతాల భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంపలి లక్ష్మణ, మహదాస్యం బాబ్జి, వెంపల లక్ష్మణరావు, మహాధ్యాసం వంశీ, గడే అప్పలనాయుడు,కొత్తకోట గోవిందరావు, బొండాడ సత్యరావు, ఆమిటి చిన్నారావు, లొట్టి తవుడు, చీకటి కేశవరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

విశాలాంధ్ర - గుర్ల: ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు 33/11కేవీ గుర్ల సబ్ స్టేషన్ పరిధి లో 11 కేవీ ఫీడర్ లైనులో ఉన్నచెట్టు కొమ్మలు తొలగించుట కొరకు పల్లిగండ్రేడు, బూర్లు పేట, పకీరుకెత్తలే, కొండగండ్రేడు, బొత్స పేట, గొల్లపేట, మునకాల పేట, ముద్దాడ పేట, వల్లపేట, గేదెల పేట,గ్రామాలకు విద్యుత్ కు అంతరాయము కలుగుతుందని విజయనగరం టౌన్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. త్రినాధ రావు తెలిపారు.

రీ సర్వే వినతులన్నీ త్వరితగతిన పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్

విశాలాంధ్ర - బొబ్బిలి: రెవిన్యూ, రీ సర్వే వినతులన్ని వారంలో పరిష్కారం కావాలని జాయింట్ కలెక్టర్ ఎస్ సేతు మాధవన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల రెవిన్యూ అధికారులతో జిల్లా జాయింట్ కలెక్టర్ జేసి సేతు మాధవన్ ఇళ్ళ స్థలాల క్రమ బద్ధీకరణ, అందరికీ గృహాలు, ఇళ్ళ స్థలాల రీ వెరిఫికేషన్, వాటర్ టాక్స్ , ఆన్లైన్ సర్వీసెస్ పెండింగ్ , రీ సర్వే , పిజిఆర్ఎస్ వినతుల పై సమీక్షించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ మాట్లాడుతూ స్థలాల క్రమబద్ధీకరణ కోసం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఆక్రమితదారులతో దరఖాస్తులు పెట్టించాలని, అందు కోసం వి.ఆర్.ఓలు క్షేత్ర స్థాయి లో ఇంటింటికీ సందర్శించాలని తెలిపారు. రెండు రోజుల గడువు లో అన్ని గ్రామాలలో పర్యటించి ఆక్రమిత భూముల వివరాలను నమోదు చేయాలనీ సూచించారు. ఈ సమావేశంలో ఆర్.డి.ఓ రామ్మోహన్ రావు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏ.డి రమణ మూర్తి , నియోజకవర్గనికి చెందిన తహసిల్దార్లు, సర్వేయర్లు, వి.ఆర్.ఓ లు, డి.టి లు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి యువకుడు మృతి

విశాలాంధ్ర - తెర్లాం: మండలంలో ఆటో బోల్తాపడి యువకుడు మృతి చెందినట్టు ఎస్ఐ సాగర్ బాబు తెలియజేశారు. వివరాల్లోకి వెళితే మృతుడు గెద్ద రామకృష్ణ (20) గరివిడి మండలం కోడూరు గ్రామానికి చెందిన వ్యక్తి అని తెర్లాం మండలం రాజయ్యపేట గ్రామానికి ఐదు రోజులు ముందు మేనమామ అయిన చల్లా ఈశ్వరరావు ఇంటికి పెళ్లి, పండగ నిమిత్తం వచ్చాడు. బుధవారం సాయంత్రం అదే మండలం ఎంఆర్ అగ్రహారం గ్రామంలో ఒక వివాహమునకు అతడు ఆటోలో ప్రయాణించాడు. అక్కడ రాత్రి భోజనం అయిన తరువాత తిరిగి ఇంటికి వస్తున్న సమయంలో వెంకటేశ్వర జూనియర్ కాలేజ్ దగ్గర ఆటో బోల్తాపడి రామకృష్ణ మృతి చెందాడన్నారు. మృతుడిని బాడంగి పీహెచ్సీకి పంచనామా నిమిత్తం తరలించారు. ఈ సమాచారాన్ని ఆటో డ్రైవర్ గెద్ద రాజు పోలీసులకు చేరవేశాడని, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

నిషేధిత ప్లాస్టిక్‌ను పట్టుకున్న మున్సిపల్ అధికారులు

విశాలాంధ్ర-విజయనగరం: నిషేధిత ప్లాస్టిక్‌ను గుర్తించిన ప్రజారోగ్య అధికారులు వాటిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. గురువారం ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి నేతృత్వంలో ప్రజారోగ్య సిబ్బంది ఉడా కాలనీ ఫేజ్ 2,3, పాల్ నగర్ ప్రాంతాలలో పర్యటించారు. స్థానికంగా నెలకొన్న పారిశుధ్య

పరిస్థితులను గమనించిన అనంతరం చుట్టుపక్కల ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ విక్రయం, వినియోగాలపై దాడులు చేపట్టారు. దీంతో కొన్ని దుకాణాలలో నిషేధిత ప్లాస్టిక్ లభ్యం కావడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. సుమారు 10 కేజీల వరకు ఉండే ప్లాస్టిక్ బ్యాగులు, ముచ్చులను, సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ఉడా కాలనీలో పర్యటించామన్నారు. ఈ నేపథ్యంలో ప్లాస్టిక్ వినియోగం,విక్రయాలపై దృష్టి సారించామన్నారు. దీంతో కొన్ని దుకాణాలలో నిషేధిత ప్లాస్టిక్ లభ్యం కావడంతో వాటిని సీజ్ చేసామన్నారు. ఇటువంటివి పునరావృతమైతే దుకాణదారులకు అపరాధ రుసుములు విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకుడు రామారావు తదితరులు పాల్గొన్నారు.

లచ్చనవలసలో అన్నదానం

విశాలాంధ్ర - రేగిడి: మండలంలోని దేవుదల, లచ్చనవలస గ్రామంలో గురువారం శ్రీ హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అన్న సమారాధన నిర్వహించారు. తమలపాకుల అర్చన, కలశ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ భక్తులు, ఆలయ కమిటీ ఉన్నారు. మండలంలో పలు గ్రామాల్లో వెలసిన శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయాల్లో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

హనుమాన్ జయంతి ర్యాలీలో సిరి సహస్ర (సిరమ్మ)

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విజయనగరం టౌన్‌లో బొంకుల దిబ్బ, కోట ఎదురుగా హిందూ ధర్మ రక్షా సమితి ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి సందర్భంగా జరిగిన హనుమాన్ జయంతి ర్యాలీలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ , వై.యస్.ఆర్.సి.పి. జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గం సమన్వయ కర్త మజ్జి శ్రీనివాస రావు (చిన్న శ్రీను) కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర (సిరమ్మ) పాల్గొన్నారు. హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు సిరమ్మకు ఘనస్వాగతం పలికారు. తదుపరి ఆమె ర్యాలీ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి యువత హనుమాన్ చాలీసా తప్పనిసరిగా రోజూ చదవాలన్నారు. భారతదేశ గొప్పతనం దానిలోనే ఉందన్నారు. సనాతన ధర్మ విశిష్టత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని కోరారు. హిందూ ధర్మ రక్షా సమితి సభ్యులు చేసిన ఈ మహత్తరమైన ర్యాలీకి అభినందనలు తెలిపారు.

అధిక ధరలకు పుస్తకాలు విక్రయిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి శ్రావణ్ కుమార్

విశాలాంధ్ర - బొబ్బిలి: పట్టణంలో పలు కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రభుత్వ విద్యా శాఖ నిబంధనలకు విరుద్ధంగా స్కూళ్లలో పుస్తకాలు యూనిఫారం దుస్తులు అధిక ధరలకు అమ్మకాలు చేసి నిలువు దోపిడీలకు పాల్పడుతున్న విద్యాసంస్థలపై సంబంధిత శాఖల అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి వి.శ్రావణ్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం శ్రావణ కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు అడ్మిషన్లు ఫీజు పేరుతో సుమారు రెండు వేల రూపాయలు నుండి ఐదు వేల రూపాయలు వరకు అక్రమ వసూలు చేస్తున్నారన్నారు. పుస్తకాలు అయా విద్యాసంస్థలలోనే కొనుగోలు చేయాలని, బయట కొన్న పుస్తకాలను స్కూల్లో అనుమతించబోమని తల్లిదండ్రులకు చెప్పడం అన్యాయం అన్నారు. వారి ఇష్టానుసారంగా ఫీజులను పెంచి విద్యార్థుల తల్లిదండ్రుల రక్తాన్ని జలగల్లా పీల్చుకు తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో ఎటువంటి ప్లేగ్రౌండ్స్ లేని కమర్షియల్ బిల్డింగ్‌లకు స్కూల్స్ పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా నడపడానికి అనుమతులు ఈ విద్యాశాఖ అధికారులు ఎలా ఇస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. స్కూళ్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ప్రభుత్వ నిబంధన పాటించని విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పట్టణ నాయకులు ఎం.యుగంధర్. ఎస్.గణేష్. ఎం.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రకు భారీ ప్రణాళిక

100 మంది టిఓటిల ఎంపిక
గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో కార్యక్రమాలు
జిల్లా కేంద్రంలో ప్రతిరోజు ఒక కార్యక్రమం
జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్

విశాలాంధ్ర - విజయనగరం కంటోన్మెంట్: ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సూచనల మేరకు యోగాంధ్ర కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు భారీ ప్రణాళికను రూపొందించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ తెలిపారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో విస్తృత అవగాహనా కార్యక్రమాలను నిర్వహించడానికి ఆయా స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు, యువత, స్వచ్ఛంద సంస్థలు ...ఇలా అన్ని వర్గాల ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నామని చెప్పారు. ప్రత్యేకంగా ఉపాధి వేతనదారులు సుమారు 5వేల మందితో ఒక యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో యోగా స్ట్రీట్‌ను ఏర్పాటు చేసి, ప్రతిరోజూ ఒక కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. రోజుకో మండలం చొప్పున ఎంపిక చేసి ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. యోగా మంత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలను ఇలా వివరించారు.

100 మంది టిఓటిలు :

5 రోజుల యోగా ప్రోటోకాల్ (శిక్షకులకు, ప్రధాన శిక్షకులకు)

3 రోజుల యోగా ప్రోటోకాల్ (సాధారణ ప్రజలకు)

(మోరార్జీ దేశాయ్ జాతీయ యోగా సంస్థ, న్యూఢిల్లీచే అభివృద్ధి చేయబడినది).

1. 100 టీఓటీల గుర్తింపు మరియు నమోదు, ఏర్పాట్లు మరియు మానిటరింగ్ మే 23.
2. టీఓటీలకు శిక్షణ మే 24, 25.
3. మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్ల గుర్తింపు మరియు నమోదు (ప్రతి కార్యదర్శి వద్ద కనీసం 7 ట్రైనర్లు, ప్రతి మండలానికి 200 మంది) మే 25.
4. మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ మే 27 నుండి 31 వరకు.
5. గ్రామ / వార్డు స్థాయిలో శిక్షణ, ప్రతి సెషన్‌కు కనీసం 50 మందిని లక్ష్యంగా పెట్టుకుని నిర్వహణ, వివిధ స్టేక్‌హోల్డర్ల నమోదు జూన్ 2 నుండి 21 వరకు.

గుర్తించిన పర్యాటక ప్రదేశాలలో (కనీసం 1,000 మందితో) యోగా ప్రదర్శనలు నిర్వహణ :

1. 30-05-2025 శుక్రవారం రామనారాయణం.
2. 06-06-2025 శుక్రవారం చింతపల్లి బీచ్
3. 12-06-2025 గురువారం రామతీర్థం.
4. 19-06-2025 గురువారం తాటిపూడి.
5. థీమ్ ఆధారిత యోగా కార్యక్రమం (కనీసం 5 వేల మందితో)

నాటుసారా రహిత గ్రామంగా కోదులగుమ్మడ

విశాలాంధ్ర - రాజాం/వంగర: రాజాం ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల వంగర మండలంలో ఉన్న కోదులగుమడ గ్రామంలో నాటుసారా కేసులు నమోదు కావడంతో జిల్లా యంత్రాంగం ఆ గ్రామాన్ని బి-కేటగిరిలో చేర్చారు, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నాటుసారాను నివారించే ఉద్దేశ్యం తో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా కోదుల గుమ్మడ గ్రామంలో నాటుసారా నివారణ గురించి మండల స్థాయి కమిటీ గ్రామ స్థాయి కమిటీలు ఏర్పాటు చేసి, ఆ కమిటీల ఆధ్వర్యంలో పలు అవగాహనా సదస్సులు నిర్వహించి నాటుసారా రహిత గ్రామంగా డిక్లేర్ చేశారు. రాజాం ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ గురువులు, గ్రామ పెద్దలు గంగరావు తదితరులు ఇతర గ్రామ కో ఆర్డినేషన్ కమిటీ యొక్క సహకారంతో కోదులగుమడ గ్రామంలో నాటుసారా ఆనవాళ్లు పూర్తిగా లేకుండా చేయడంతో నాటుసారా రహిత గ్రామంగా గ్రామ దత్తత అధికారి అయిన ఎస్.ఐ. జి.మాన్యాలు ఆధ్వర్యంలో ప్రకటించడం జరిగిందని సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు.

అధికారులకు ప్రజల ప్రాణాలంటే లెక్క లేదా...!

- బ్లాస్టింగ్ పదార్థాల గిడ్డంగి యజమానితో కుమ్మకయ్యారా...
- స్పందన ఫిర్యాదుదారులకు తెలియకుండా పరిశీలనలా...
- కలెక్టర్ గ్రీవెన్స్‌పై నమ్మకం కోల్పోతున్న ప్రజలు
- రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామంటున్న గ్రామస్తులు

విశాలాంధ్ర - వేపాడ : మండలంలోని వీలుపర్తి పంచాయతీ శివారు చామలాదేవి అగ్రహారం రెవిన్యూలో సర్వేనెంబర్ 4లో క్వారీల పేలుడు పదార్థాల గిడ్డంగి గ్రామానికి సమీపంలో అర కిలోమీటర్ దూరంలో అనుమతులు ఇవ్వడం చూస్తే అధికారులకు ప్రజల ప్రాణాలు అంటే లెక్క లేదనే చెప్పాల్సి వస్తుంది. అనుమతుల కోసం పంచాయతీ తీర్మానం తీసుకున్నప్పటి నుండి గ్రామస్తులకు తెలిసినప్పటి నుండి జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌తోపాటు జిల్లా అధికారులందరికీ అనుమతులను రద్దు చేయాలని కోరుతున్నప్పటికీ ఫిర్యాదు చేసిన ఫిర్యాదుదారులకు గ్రామస్తులకు తెలియకుండా గిడ్డంగి యజమానితో కుమ్మక్కయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులను పరిష్కరించామని కింది స్థాయి అధికారులు ఉన్నతాధికారులకు నివేదికలు అందించడం చూస్తే గిడ్డంగి యజమానితో చేతులు కలిపారని పలు సందేహాలు నివృతం అవుతున్నాయి. అలాగే జిల్లా ఎస్పీ కార్యాలయంలో గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేయగా ఆఫిర్యాదుపై స్పందించిన జిల్లా అధికారులు రూరల్ సర్కిల్ కార్యాలయానికి పరిశీలన చేసి నివేదిక అందించమంటే రూరల్ సీఐ యజమాని చూపించిన రహదారిని మాత్రమే పరిగణన లోకి తీసుకొని గ్రామస్తుల అభిప్రాయాన్ని గ్రామానికి బ్లాస్టింగ్ పదార్థాల గిడ్డంగికి గల దూరంపై పరిశీలన చేయకపోవడంపై అధికారులు తీరుపైమండిపడుతున్నారు.అలాగే విజయనగరం ఆర్డిఓ దాట్ల కీర్తి ఇదే గిడ్డంగి పరిశీలన విషయమై గిడ్డంగి దగ్గరికి వచ్చి గిడ్డంగికి గ్రామానికి గల దూరాన్ని గూగుల్ సర్వే చేసి రిపోర్ట్ అందించాలని మండల రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.జిల్లా ఆర్డీఓ ఆదేశాలు ఏమయ్యాయో నేటికీ తెలియదని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అలాగే కలెక్టర్ గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేసిన నాడే జిల్లా కలెక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వేపాడ మండల తహసిల్దార్ జె. రాములమ్మకి బ్లాస్టింగ్ పేలుడు పదార్థాల గిడ్డంగిని సీజ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాలు పెడచెవిన పెట్టి సంబంధిత గిడ్డంగి యజమానితో రెవిన్యూ అధికారులు చేతులు కలిపి గ్రామస్తులు సమస్యపై నేటికీ స్పందించకపోవడం చూస్తే పలు అనుమానాలకు తావిస్తుందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయంపై రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు. ఈ గిడ్డంగికి అందరి అధికారులు అనుమతులు ఉన్నాయని చెప్పడమే గాని అవి నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయా లేవా అనేది ఏ అధికారి చెప్పకపోవడం దారుణమంటున్నారు.అలాగే అన్ని అనుమతులు ఉన్నప్పటికీ మా గ్రామ సమీపంలో మా వ్యవసాయ భూములకు అనుకొని మా పశువులు కల్లాలకు అనుకోని ఇటువంటి గిడ్డంగికి అనుమతులు ఇచ్చినా రద్దు చేయాలని గ్రామస్తులు ఖరాఖండిగా చెబుతున్నారు. ఇప్పటికే రాతి క్వారీలలో చేపట్టే రిగ్గు బ్లాస్టింగ్లకు మా చుట్టుపక్కల గ్రామాలు భూకంపం మాదిరిగా కనిపించడంతో పాటు ఇళ్ల గోడలు బద్దలవుతున్నాయని పేలుడు పదార్థాలతో చేపట్టిన రిగ్ బ్లాస్టింగ్ లకే మా గ్రామాల్లో భయాందోళనల మధ్య జీవించాల్సి వస్తుందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.ఏది ఏమైనా బ్లాస్టింగ్ పదార్థాలు గిడ్డంగికి ఇచ్చిన అనుమతులను రద్దుచేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని చామలాదేవి అగ్రహారం,వావిలపాడు గ్రామస్తులు కోరుతున్నారు.